


# పరదేశీ కథలు

## – చిట్టే సిద్ధ లలిత



-87-

## ఎడారిలో వసంతం

అర్ధరాత్రి.. రోజంతా పనిచేసిన ఊరు అలసి సొలసి నిద్రిస్తోంది. మేము కూడా గాఢ నిద్రలో వున్నాం. ఇంతలో ఎవరో దబదబా తలుపులు బాదిన శబ్దం. ఒక్కసారిగా అందరం ఉలిక్కిపడి లేచాం.

ఈ సమయంలో ఎవరా అని కంగారు పడుతూ మా అమ్మ తలుపు తీసింది. బయట చంకలో ఒక బిడ్డనెత్తుకుని చేత్తో మరో బిడ్డను పట్టుకుని ఏడుస్తూ నిలబడిన వెంకట లచ్చిమి కనబడింది.

"ఏమయింది లచ్చిమీ ఎందుకేడుస్తున్నావ్" ఆదుర్దాగా ప్రశ్నించింది మా అమ్మ.

మేమంతా చిన్నపిల్లలం కళ్ళు నులుముకుంటూ నిద్రమత్తుతో చూస్తున్నాం.

"తాగుబోతోడు రోజూ కొట్టి చంపుతున్నాడమ్మా..బతకనీయడం లేదు. వళ్ళంతా దెబ్బలే. ఇంక తట్టుకోలేక ఇల్లొదిలిపెట్టి పిల్లల్ని జవురుకోని మీ దగ్గరికి వచ్చినాను. మా అమ్మగారింటికి పోతే అక్కడికి వచ్చి పట్టుకోని కొడతాడు. అయ్యంటే భయం వాడికి. ఇక్కడికైతే రాడు. ఈ రాత్రికి మీ వసారాలో పడుకోనియ్యండి" అర్థించింది లచ్చిమి.

"అయ్యో.. వాడికి ఎంత చెప్పినా బుద్ధి రావడం లేదే. పిల్లోళ్ళ మొహం చూసయినా తెలివి తెచ్చుకోకపోతే ఎట్లా" అంటూ మా నాయన వైపు చూసింది మా అమ్మ.

వీళ్ళ మాటలన్ని వింటున్న మా నాన్న "సరే చాప, రెండు దుప్పట్లు ఇయ్యి. వసారాలో పడుకుంటారు. పొద్దన్నే సుబ్బి గాడ్ని పిలిపించి మాట్లాడతా" అన్నారు.

లచ్చిమి ఊపిరి పీల్చుకుంది. వసారాలో చాపేసుకుని దుప్పటి పరిచి పిల్లలను పడుకో బెట్టింది.

"పిల్లోళ్ళు ఏమైనా తిన్నారా లేదా. అన్నం వుండాది పెట్టేదా? " అడిగింది మా అమ్మ.

"తిన్నారమ్మా. రేపు పొద్దున్నే చద్దన్నం తింటారులే" అనింది లచ్చిమి.

ఈ మాదిరి కొట్టిచ్చుకుంటా ఎన్నిరోజులు బతుకుతాది లచ్చిమి అనుకుంటూ ఆవులిస్తూ వచ్చి పడుకుంది మా అమ్మ.

లచ్చిమి మా పాలేరు భార్య. మా పొలం పనులన్ని వాళ్ళే చూస్తారు. పొద్దున్నే లేచి అంట్లన్నీ తోమేసింది లచ్చిమి. బయటంతా ఊడ్చి కళ్ళాపు జల్లింది. మా అమ్మ ముగ్గేసింది. చద్దన్నం పెడితే పిల్లలు, లచ్చిమి కడుపునిండా తిన్నారు. మా బట్టలు పాతవి వుంటే బయటకు తీసి పిల్లలకు ఇచ్చింది మా అమ్మ.

"పిల్లోళ్ళ కోసం ప్రాణంతో వున్నానమ్మా. తాగొచ్చి కొడుతుంటే ఎముకలు విరిగిపోతున్నాయి. వళ్ళంతా దెబ్బలే. పనిచేసిన దుడ్డు ఒక్క పైసా ఇంట్లో ఇవ్వడు, తిండికీ తెచ్చివ్వడు. వచ్చిందంతా తాగేస్తాడు. ఇలాంటి మొగుడు నాకెందుకు" తన కష్టం చెప్పుకుని భోరుమంది లచ్చిమి.

"సరేలే ఏడవకు. నువ్వేడిస్తే పిల్లోళ్ళు ఏడుస్తారు. ఈ రోజు మీ అయ్య సుబ్బిగాడితో మాట్లాడి భయం పెడతాడులే" ఓదార్చింది మా అమ్మ.

ఆరోజు సుబ్బిగాడ్ని పిలిపించి "పెళ్ళాన్ని కొట్టడం మగతనం కాదురా. పెళ్ళాం బిడ్డలకు తిండిపెట్టి సాకేవాడు మగవాడు. ఇకనుంచీ నువ్వు తాగినట్టు తెలిసినా, ఆయమ్మిని కొట్టినట్లు తెలిసినా ఊళ్ళో వుండవు" అంటూ తిట్టినాడు మా నాన్న.

చేతులు కట్టుకోని తలవంచుకుని అన్నీ విన్నాడు వాడు.

"ఇంక ఎప్పుడూ తాగనయ్యా" అంటూ పెళ్ళాం బిడ్డలను తోడుకోని పోయినాడు.

నాల్రోజులు.. మళ్ళీ మామూలే. ఇక కుదరదనుకుని

వచ్చి మా నాన్న కాళ్ళు పట్టుకుని "అయ్యా ఇరవై వేలు దుడ్డు అప్పియ్యి. బిడ్డలను మాయమ్మ దగ్గర వదిలిపెట్టి నేను కోయేటికి పోతా. పోతానే ప్రతినెలా జీతాన్ని నీకు పంపించి బాకీ జమ చేస్తా" అని అడుక్కుంది లచ్చిమి.

"సరేలే పో. అక్కడికి పోతే అన్నా ప్రాణంతో బతుకుతావు" అన్నాడు మా నాన్న.

నాలుగు నెలలు గడిచాయి. ఈ లోపల లచ్చిమి కువైటే ధ్యాసగా పాస్పోర్టు చేయించుకోని తెలిసిన వాళ్ళతో కువైట్ వీసా తెప్పించుకుంది.

మద్రాస్ పొయ్యి మెడికల్ చేయించుకుని పిల్లోళ్ళను వాళ్ళమ్మకు అప్పజెప్పి ఒకరోజు విమానం ఎక్కేసింది. లచ్చిమి పోయేంతవరకూ ఈ విషయం సుబ్బిగాడికి తెలియదు. భార్య కొయేటు పోయిందని తెలిసి లబోదిబో మన్నాడు. పిల్లోళ్ళను ఇమ్మని వాళ్ళత్తతో గొడవ పెట్టుకున్నాడు.

వాడి పోరు భరించలేక మరలా పెద్ద మనుషులతో మద్దిస్తం పెట్టింది వాళ్ళత్త.

"తాగుబోతోడివి నువ్వు పిల్లలను ఏం జూసుకుంటావు. మీ అత్త దగ్గరే వుండనీ" అని అందరూ తిడితే ఇక ఏమీ

చెయ్యలేక నోరు మూసుకుని పోయాడు సుబ్బిగాడు.

కువైట్ చేరతానే అక్కడంతా బానే వుందనీ తొందరలో దుడ్డు పంపిస్తాననీ జాబు రాసింది లచ్చిమి.

కొద్దికాలం బానే గడిచింది.

సంవత్సరం తిరిగేసరికి చేసిన అప్పులు తీర్చేసింది లచ్చిమి.

ఎవరో వస్తుంటే పిల్లలకు బట్టలు చాక్లేట్లు, వాళ్ళమ్మకు చీరలు కూడా పంపించింది.

సుబ్బి గాడు మాత్రం తాగి అపుడపుడూ అత్తగారింటికి పోయి కేకలేసేవాడు. పెళ్ళాం బిడ్డలు కావాలని ఏడ్చేవాడు.

ఒకరోజు సుబ్బిగాడు ఉన్న కుంటడు పొలం కూడా అమ్మేసి కువైట్ పొయ్యేందుకు తయారై పొయినాడు.

తాగుబోతోడివి నీకెందుకురా కొయేటు. అక్కడ తాగేదానికి వుండదు. ఎడారిలో గొర్రెలు కాయాల నువ్వు అని అందరూ చెప్పినారు.

వాడు వినలేదు. డబ్బు పెడితే కొండ మీద కోతి కూడా దిగి వస్తుంది. వీసా తెప్పించుకున్నాడు. తాగుడు కూడా మానేసినాడు. అందరూ ఆశ్చర్యపొయినారు.

పిల్లోళ్ళ దగ్గరికి పోయి ముద్దులాడి కొయేటికి పోయి మీ అమ్మను తీసుకొస్తా. మీకు అన్నీ తెస్తా అని చెప్పినాడు.

పిల్లలకు టాటా చెప్పి కోయేటికి పొయినాడు.

సుబ్బిగాడు కోయేటికి వచ్చినాడని వాళ్ళమ్మ జాబు రాసింది. చదివి కొంచెం కంగారు పడింది లచ్చిమి.

అయినా కువైట్ లో అడ్రస్ కనిపెట్టడం.. తెలిసినా కువైట్ సేటుల ఇంట్లో ఉండే తన దగ్గరికి రావడం అసాధ్యం. పట్టుకుంటే కీళ్ళు విరిచేస్తారు అనుకుంది.

కొద్ది నెలలు గడిచాయి. ఒకరోజు సేతాని బట్టలు ఐరన్ చేస్తోంది లచ్చిమి.

ఇంతలో ఫోను మోగడంతో సేతాని తీసి "లచ్చిమీ నీకే ఫోను వచ్చి మాట్లాడు" అని పిలిచింది.

అవతల సుబ్బిగాడు లైన్లో వున్నాడు.

"లచ్చిమీ ఎంత కష్టపడ్డానో నీ ఫోను నంబర్ తెలుసుకోవడానికి. ఒకసారి నిన్ను చూడాలి. మీ మామా బాబాకు చెప్పు. వచ్చి చూస్తాను" అని ప్రాధేయ పడ్డాడు.

కాస్త మనసు కరిగినా వాడు కొట్టిన దెబ్బలు గుర్తు చేసుకుని కఠినం చేసుకుంది లచ్చిమి.

"నువ్వు ఇక్కడికి కూడా దాపురించావా.. నన్ను వదలవా" అని అరిచింది.

"నా మాట విను లచ్చిమీ నేను మారిపోయాను. నన్ను నమ్ము. సంపాదించి మిమ్మల్ని బాగా చూసుకుంటాను" అని

ఏడ్చాడు.

వినలేదు లచ్చిమి. "నన్నిలా బతకనివ్వు" అంటూ ఫోను కట్ చేసింది.

✲✲✲

ఆ రోజంతా ఆలోచనలతో సతమతమవుతూ అన్యమనస్కంగా గడిపింది లచ్చిమి.

వీడి బారినుండి తప్పించుకుని ఇంతదూరం కొయేటికి వస్తే.. వదలకుండా ఇక్కడికి కూడా దాపురించాడు.

ఫోన్ నంబర్ తెలుసుకుని కాల్ చేసాడు. ఎలా ఇతన్ని తప్పించుకోవడం. అయినా కొయేటిలో సారాయి వుండదు.

ఇక్కడ తాగి తందనాలాడటానికి కుదరదు. ఇది ఇండియా కాదు వచ్చి కొట్టి తిట్టి వేధించడానికి. కొయేటి వాళ్ళకు తెలిస్తే కీళ్ళు విరిచేస్తారు. కాస్త స్థిమిత పడింది లచ్చిమి.

✲✲✲

రెండ్రోజులకు అత్త వరసయ్యే చంచమ్మ ఫోన్ చేసి "ఏమే బాసాలీ నీ మీద ప్రేమతో నిన్ను వెతుక్కుంటా నీ మొగుడు కొయేటికి వచ్చినాడు. నువ్వు మాట్లాడితే చాలు అంటున్నాడు. తాళి గట్టిన మొగుడ్ని మర్చిపోతావా.

వాడు తాగుడు మానేసి ఇక్కడ ఉద్యోగం చేసి బాగా సంపాదిస్తున్నాడు. పిల్లోళ్ళను బాగా చదివిస్తా. ఇల్లు కడతా అంటున్నాడు. ఇంక నీకేం కావాలి చెప్పు. ఆడదానివి అంత నిక్కు చూపిస్తే బావుండదు. మొగుడిని కలుసుకొని సంతోషంగా మాట్లాడు". అని నీతి బోధ చేసింది.

"చాల్లే అత్తా బాగ చెప్పినావు. ఇంటికాడ వున్నంత వరకూ కన్న బాధలూ పెట్టి కొట్టి చంపినాడు. ఆ దెబ్బలను నేనింకా మర్చిపోలేదు. మనసు కఠినం చేసుకుని కోయేటు వచ్చినాను. ఇక్కడన్నా నన్ను మనశ్శాంతిగా బతక నివ్వండి. ఇక ఈ విషయమై నువు ఫోను చెయ్యకు. నాతో మాట్లాడకు" అంటూ ఖరాఖండిగా చెప్పేసింది లచ్చిమి.

✲✲✲

అపుడప్పుడూ సుబ్బిగాడు ఫోను చేస్తూనే వున్నాడు. అతని మాట వినబడగానే కాల్ కట్ చేస్తోంది లచ్చిమి.

మూడు నెలలనుండీ ప్రతినెలా పిల్లల ఖర్చులకు డబ్బు పంపిస్తున్నాడని వాళ్ళమ్మ చెప్పడంతో వాడిలో వచ్చిన మార్పుకు ఆశ్చర్యపోయింది లచ్చిమి.

వాళ్ళమ్మ కూడా "వాడు నీకోసం ఏడుస్తున్నాడు. ఒకసారి సుబ్బిగాడితో మాట్లాడవే లచ్చిమీ" అని చెప్పింది.

అయినా కరగలేదు లచ్చిమి హృదయం.

గుండెను బండగా చేసుకోకపోతే కష్టం అని అనుకుని ఊరుకుంది.

మూడేళ్ళు గడిచాయి. సుబ్బిగాడు అపుడపుడూ ఫోన్ చేసి ఒకసారి చూడాలని వుందని ప్రాధేయపడుతున్నాడు.

లచ్చిమి లెక్క చెయ్యలేదు.

వచ్చి నాలుగేళ్ళయింది. పిల్లలు కూడా పెద్దయ్యారు. స్కూల్ కు పోతున్నారు. ఒకసారి ఇంటికి వెళ్ళి పిల్లలను చూడాలి అని నిర్ణయించుకుంది లచ్చిమి.

సేటు సంతోషంగా టికెట్ తెచ్చి ఇచ్చి రెండు నెలలు సెలవులకు ఇండియా వెళ్ళి మరలా తిరిగి రమ్మని చెప్పినాడు.

నాలుగేళ్ళు తమ ఇంట్లో వుండి నమ్మకంగా పని చేసినందుకు రెండు నెలల జీతం కూడా ఇచ్చినాడు.

మామా పిల్లల కోసం బట్టలు, బహుమతులు చాలా ఇచ్చింది.

సంతోషంగా లగేజీ అంతా మోసుకుని మద్రాసు ఎయిర్పోర్ట్ లో విమానం దిగి ఇంటికి వచ్చింది లచ్చిమి.

ఇంట్లోకి అడుగు పెడుతూనే పిల్లలు అమ్మను కౌగిలించుకున్నారు.

నాలుగేళ్ళ ఎడబాటు తరువాత పిల్లలను చూడగానే మైమరిచి పోయింది లచ్చిమి. ఆనంద భాష్పాలను రాల్చింది.

పిల్లల ముద్దు మాటలతో కాలం వసంతాన్ని పులుముకుంది. పాపిష్టి డబ్బు. పిల్లలను వదిలి ఆ ఎడారికి వెళ్ళి సంపాదించడం అవసరమా అనిపించింది లచ్చిమికి. కానీ ఇంకా ఆర్థిక పరిస్థితి చక్కబడలేదు.

ఈ నాలుగేళ్ళూ అప్పులు దీర్చడానికి, పిల్లల పోషణ, చదువులకు సరిపోయింది. మిగిలిన కాస్త డబ్బుతో పిల్లల మెళ్ళోకి రెండు గొలుసులు కొన్నది. ఈసారి వెళ్ళి ఇంకో నాలుగేళ్ళు వుండి వస్తే ఇల్లు కట్టుకోవచ్చు. తరువాత వెళ్ళాల్సిన అవసరం లేదు అనుకుంది లచ్చిమి.

లచ్చిమి వచ్చిన నెల రోజులకు సుబ్బిగాడు కూడా ఇంటికి వచ్చేసాడు. వచ్చి పిల్లలు, లచ్చిమి కావాలని లచ్చిమి వాళ్ళమ్మను అడిగాడు.

లచ్చిమి అతని ముఖం కూడా చూడలేదు. "రాను పో" అంది.

పిల్లలకు తెచ్చిన వస్తువులన్నీ వాళ్ళమ్మకు ఇచ్చి "నా సంపాదనతో స్థలం కొంటున్నాను. అది లచ్చిమి పేరు మీద పెడుతున్నాను" అన్నాడు.

"వాడు మారిపోయాడే. వాడితో మాట్లాడు" అని లచ్చిమి వాళ్ళమ్మ చెప్పింది.

ఎందుకో లచ్చిమి మనసు మారలేదు. ఒకరోజు తిరపతి పోదామని బస్ కోసం చూస్తావుంటే రయ్ మని బైక్ లో వచ్చాడు సుబ్బిగాడు.నీటుగా దువ్వుకున్న క్రాఫ్. నల్ల కళ్ళద్దాలు. నలగని గళ్ళ షర్టుతో హీరోలా వున్నాడు. ఎవరా అని తేరిపార చూసింది లచ్చిమి.

గుండె ఝల్లుమంది. చింపిరి జుట్టేసుకుని చిరిగిన షర్టు తొడుక్కుని తాగిన నిషాలో తూలుతూ నడిచే సుబ్బిగాడు ఎంతగా మారిపోయాడు.

"లచ్చిమీ ఎక్కు" అన్నాడు నవ్వుతూ.

అంతే మారు మాట్లాడకుండా బొమ్మలా బైక్ ఎక్కి కూర్చుంది లచ్చిమి.

తిరపతికి పోయి సినిమా చూసారు. హోటల్లో అన్నం తిన్నారు. సాయంత్రం టిటిడి పార్కుకెళ్ళారు. రంగుల బల్బులతో వాటర్ ఫౌంటైన్ నీళ్ళను విరజిమ్ముతుంటే చూస్తూ సుబ్బిగాడి చేతిలో చేయి వేసి నడుస్తుంటే ఇది కలా నిజమా అని నమ్మలేకపోతోంది లచ్చిమి.

ఎంతగా మారిపోయాడు. నిజంగా ఆ ఏడుకొండలవాడు తన మొర విన్నాడు అనుకుంటూ అలిపిరి కొండవైపు చూసి దణ్ణం పెట్టుకుంది లచ్చిమి.

మిగిలిన రోజులు సంతోషంగా గడిచిపోయాయి. భర్తతో పిల్లలతో ఆడుతూ పాడుతూ స్వర్గంలో తేలిపోయింది లచ్చిమి.

ఒకరోజు అందరూ కలిసి సంతోషంగా మా ఇంటికి వచ్చి మాట్లాడి మా అమ్మకు కొయేటు చీర మాకు బొమ్మలు ఇచ్చి వెళ్ళారు.

ఇక కొయేటు వెళ్ళే రోజు దగ్గర పడింది.సుబ్బిగాడు "నువ్వు ఇక్కడేవుండి పిల్లలను చూసుకో లచ్చిమీ నేను పోయి సంపాదిస్తాను చాలు" అన్నాడు.

"లేదు మామా తిరిగి కొయేటు వస్తానని సేటుకు మాట ఇచ్చాను. వెళ్ళక తప్పదు. రెండేళ్ళు వుండి వచ్చేస్తాను మామా" అంటూ బాధగా విమానం ఎక్కింది లచ్చిమి. ఇంకో పది రోజులు వుండి సుబ్బిగాడు కూడా కొయేటుకు బయల్దేరాడు.తాగడం మానేస్తే భార్యా పిల్లలతో బతుకు ఎంత సంతోషంగా సుఖంగా వుందో వాడికిప్పుడు అర్థం అయింది.

ఇక తాగకూడదని నిశ్చయించుకున్నాడు.తరువాత లచ్చిమి సేటుతో మాట్లాడి తన ఇంట్లోకే సుబ్బిగాడ్ని పనికి రప్పించింది. అక్కడ ఇద్దరూ చిలకా గోరింకల్లా కలిసిమెలిసి పనులు చేసుకుంటూ ప్రేమను పంచుకునేవారు. కువైట్ వాళ్ళు కూడా ముచ్చటైన ఈ జంటను చూసి సంతోషించారు. జీతాలు కూడా పెంచి బాగా చూసుకునే వారు. మరో ఐదేళ్ళు గడిచేసరికి ఊళ్ళో రెండు మిద్దెలు కట్టి రెండెకరాలు పొలం కూడా కొనుక్కున్నారు. పిల్లలు కూడా బాగా చదువుతూ హైస్కూల్ చదువులకు వచ్చేసారు. ఇంత సంపాదించినా ఎంత కాలం గడిచినా లచ్చిమి మా అమ్మను మాత్రం మరిచిపోదు. భర్త తాగొచ్చి కొడితే అర్ధరాత్రి పూట ఇంట్లోకి రమ్మని చెప్పి అన్నం పెట్టిన ఆ విషయాన్ని ఇప్పటికీ గుర్తు చేసుకుంటూ వుంటుంది.

అయ్యా.. మీరు దుడ్డు ఇచ్చి ఆదుకోబట్టే నేను కొయేటు పోయి సంపాదించుకున్నాను. మా ఆయన కూడా తాగడం మానేసి బాగుపడ్డాడు అని మా నాన్నకు కృతజ్ఞతలు తెలియజేస్తూ వుంటుంది. *(మరోకథ వచ్చేనెలలో)*